నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 17 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

నిథిమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తులు

నీలగిరి, జూన్ 16 : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో టూరిజం కోర్సులు చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత కళాశాల నిథిమ్‌లో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలతోపాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయని, జాతీయ స్థాయి విద్యా విధానంతో నిథిమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తున్నదని వివరించారు. అడ్మిషన్లు, ఇతర వివరాలకు 9553700034, 9553700035 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్యూలైన్‌లో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్టలో భక్తజన సందోహం

యాదగిరిగుట్ట, జూన్ 16 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో తిరు మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శివాలయం, శ్రీవారి మెట్ల మార్గం కిటకిటలాడాయి. సుమారు 55వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చీ సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు.

దర్బార్ సేవలో భాగంగా సువర్ణమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి నక్షత్ర హారతి ఇచ్చారు. అన్ని విభాగాలను కలుపుకొని ఆలయ ఖజానాకు రూ.89,65,064 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

'డబుల్' ఇండ్ల పంపిణీ కలేనా?

ఇండ్లను కేటాయించకుండా సర్కారు కాలయాపన

- ఎంపిక చేసి.. పంపిణీకి సిద్ధంగా ఉన్నా పట్టని వైనం
- కొన్ని మండలాల్లో అటకెక్కిన లబ్ధిదారుల లక్కీ డ్రా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు
- కనీసం చొరవ చూపని స్థానిక ఎమ్మెల్యేలు

పేదల సొంతింటి కల కలగానే మారుతున్నది. కేసీఆర్ సర్కారు హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపును కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేస్తున్నది. ఇండ్ల నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నా ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు అందని ద్రాక్షగానే మారాయి. లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినా ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు ఆందోళనలు చేపడుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూన్ 16 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్న గూడెంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఆందోళన (ఫైల్)

లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక

గతంలో ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని.. తాసీల్దార్ల ద్వారా సర్వే పూర్తి చేశారు. ఈ జాబితాలో అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వడబోశారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేశారు. భువనగిరి, ఆత్మకూర్ (ఎం), కొలనుపాలక, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోటకొండూరు, ఆలేరు, చౌటుప్పల్, నారాయణపురం తదితర మండలాల్లో డ్రా తీశారు. ఆయా మండలాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆలేరు, చౌటుప్పల్, మోటకొండూరు, ఆత్మకూర్ (ఎం) మండలాల్లో లబ్ధిదారులు గృహప్రవేశం కూడా చేశారు.

ఒక్కో ఇంటికి రూ.5.4లక్షలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చింది. పేదలకు పైసా ఖర్చు లేకుండా కేసీఆర్ సర్కారు ఇండ్లను నిర్మించింది. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున ఇండ్లను మంజూరు చేసింది. జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాలకు 3,620 ఇండ్లను శాంక్షన్ చేసింది. ఇంటి నిర్మాణం కోసం గ్రామీణ ప్రాంతాల్లో 5.04లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.40 లక్షలు ఖర్చు చేశారు. వీటిని నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు వెయ్యి ఇండ్లకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా ఇండ్ల పనులు పురోగతిలో ఉన్నాయి.

ఎంపిక చేసినా పంపిణీ లేదు..

కొన్ని మండలాల్లో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయగా.. అనేక మండలాల్లో ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగలేదు. బీబీనగర్ మండలంలోని కొండమడుగులో 30 ఇండ్లు, బీబీనగర్‌లో 11 ఇండ్లు పూర్తయినా ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో ఇండ్లు కట్టినా పంపిణీ ప్రక్రియ చేపట్టలేదు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద 444 ఇండ్లను నిర్మించగా, గతేడాది అక్టోబర్‌లో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కానీ.. ఇప్పటి వరకు ఇండ్లను కేటాయించలేదు. భూదాన్ పోచంపల్లిలో 60, జిబ్లక్‌పల్లిలో 36 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసినా కేటాయించకపోవడంతో గృహప్రవేశం ఊసేలేదు.

పట్టించుకోని ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల సమస్యలపై దృష్టి సారించడంలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి సిద్ధంగా ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కనీసం పట్టించుకోవడంలేదు. దీంతో లబ్ధిదారులు రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద ఇప్పటికే పలు మార్లు ధర్నాకు దిగారు. అధికారులు వచ్చి హామీ ఇవ్వడంతో వెనక్కి తగ్గినా.. సమస్య పరిష్కారం కాకపోవడంతో పలు దఫాలుగా నిరసనలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రా తీసి ఇండ్లు ఇవ్వాలి

పోచంపల్లి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి చాలా రోజులైంది. పేదలు మూడు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్నారు. ఇంత వరకూ డ్రా తీయలేదు. లబ్ధిదారులకు అలాట్మెంట్ చేయలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో దుండగులు అద్దాలు పగులగొట్టడం, వైర్లు చోరీ చేస్తున్నారు. వెంటనే డ్రా తీసి అర్హులైన పేదలందరికీ ఇండ్లు కేటాయించాలి.

- ప్రసాదం విష్ణు, దోతిగూడెం, భూదాన్ పోచంపల్లి మండలం

ఆక్రమణలకు అడ్డేది?

- సోమిరెడ్డికుంట చెరువు శిఖం భూమి కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు



సోమిరెడ్డికుంట చెరువు శిఖాన్ని మట్టి పోసి చదును చేసిన కబ్జాదారులు

రాజాపేట, జూన్ 16 : కేసీఆర్ ప్రభుత్వం చెరువులు, కుంటల పునరుద్ధరణ కోసం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకం చేపట్టి పూర్వ వైభవం తీసుకొచ్చింది. అలాంటి చెరువులు, కుంటల శిఖం భూములపై నేడు కొంత మంది కన్నేసి కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రాజాపేట మండలం దూదివెంకటాపురం శివారులోని సర్వే నంబర్ 139లో 12.15 ఎకరాల శిఖం కలిగిన చెరువు సోమిరెడ్డికుంట. ఇది ఒక్క సారి నిండితే భూగర్భజలాలు అమాంతం పెరిగి వందల ఎకరాలు సాగవుతుంది. అలాంటి కుంట శిఖం నేడు ఆధికారుల పర్యవేక్షణ లోపంతో ఆక్రమణకు గురవుతున్నది. కుంట శిఖం ఆక్రమణకు గురవుతుందని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్‌కు ఫోన్‌లో వివరణ కోరగా.. కుంటలో తవ్వకాలు జరిపి మట్టి పోసినట్లు తన దృష్టికి రాలేదని తెలిపారు. రెవెన్యూ అధికారులను వివరణ కోరితే సర్వే చేసి చర్యలు తీసుకుంటామంటూ దాటవేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 16 : జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 32 పోస్టుల భర్తీకి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీం మెంబర్ సెక్రటరీ బి.శాంతిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు https://yadadri.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 18 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలోని ఎంప్లాయ్‌మెంట్ అసిస్టెంట్ మిషన్ (టీం) ఆఫీసులో అందజేయాలని సూచించారు. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని, ఇంతకు పూర్వం ప్రజావాణి, టీం కార్యాలయంలో అప్లై చేసుకున్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో గల టీమ్ ఆఫీస్‌లో లేదా https://yadadri.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. 10 డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల కోసం ఏదైనా డిగ్రీ గ్రాడ్యుయేషన్ మరియు గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి పీజీడీసీఏ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. 4 డిసెక్షన్ హాల్ అటెండెంట్స్ పోస్టుల కోసం పదో తరగతి ఉత్తీర్ణత, అటానమీ (డిసెక్షన్ హాల్), ఫోరెన్సిక్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో ఒక సంవత్సరం అనుభవం ఉండాలని పేర్కొన్నారు. 4 ల్యాబ్ అటెండెంట్స్ పోస్టుల కోసం బీఎస్‌సీఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణత సాధించి పారా మెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని తెలిపారు. 8 సబార్డినేట్ స్టాఫ్ పోస్టుల కోసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, 2 రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు డిప్లమో ఇన్ మెడికల్ రికార్డ్, మెడికల్ రికార్డ్ మెయింటెనెన్స్‌లో అనుభవం కలిగి ఉండాలని, 4 థియేటర్ అసిస్టెంట్ పోస్టుల కోసం పదో తరగతి ఉత్తీర్ణత, గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆమె తెలిపారు. ఈ పోస్టులను మెరిట్, అర్హతల ఆధారంగా భర్తీ చేయబడునని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన 18 నుంచి 44 సంవత్సరాల వయస్సు, అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, కులం, నివాస ధ్రువపత్రం, ఆధార్, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు బోనోఫైడ్ సర్టిఫికెట్ కాపీలు జతపరుచాలని సూచించారు. ఈ సర్టిఫికెట్లను జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలోని ఎంప్లాయ్‌మెంట్ అసిస్టెన్స్ మిషన్ (టీమ్) కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలోని టీం ఆఫీస్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు బక్రీద్

ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాహ్‌లు, మసీదులు సిద్ధం

హైదరాబాద్ చౌరస్తా సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థనల కోసం చేసిన ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, జూన్ 16 : త్యాగ నిరతికి, అల్లాహ్‌పై విశ్వాసానికి ప్రతీకగా బక్రీద్ పండుగ (ఈద్ ఉల్ ఆదా)ను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలో, పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఈద్గాహ్‌లను సిద్ధం చేశారు. ముస్లింలు ఈద్గాహ్‌లకు వెళ్లి ఈద్ నమాజ్ చేయడంతోపాటు మత పెద్దలు, మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొంటారు. అనంతరం ఖబ్రస్థాన్‌లోని తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ సందర్భంగా తాహతు కలిగిన వారు పొట్టేళ్లను ఖుర్బానీ ఇస్తారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలో పెద్ద ఎత్తున మేకపోతులు, పొట్టేళ్లను వ్యాపారులు అమ్మకానికి పెట్టగా.. పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. భువనగిరి పట్టణంలో ఉదయం 8:30 గంటలకు ఈద్గాహ్ వద్ద నమాజ్ ఉంటుందని ముతవలీ అజీజ్ ఫారుక్ హుస్సేన్ తెలిపారు.

గంజ్ మసీదు, ఖిల్లా మసీదులో ఉదయం 6గంటలకు, హన్మాపూర్ రైల్వే గేట్ వద్ద మసీదులో ఉదయం 7గంటలకు, రైల్వే స్టేషన్ మసీదులో 7:15కు, నూతన ఈద్గాహ్ చెరువు కట్ట వద్ద 7:30 గంటలకు ఉంటుందని ప్రత్యేక నమాజ్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శాలిగౌరారం ప్రాజెక్టు నీటి విడుదల

శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

- నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలి
- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, జూన్ 16 : జిల్లాలో పేరొందిన శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం కుడి కాల్వ గుండా లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు రైతుల సంక్షేమం కోసం విడుదల చేసిన ప్రాజెక్టు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఆయకట్టు కింద 5వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నందున ప్రాజెక్టులో ఎప్పుడూ నీరు సమృద్ధిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంత రైతాంగానికి శాలిగౌరారం ప్రాజెక్టు వరంలాంటిదని, ఏటా వానకాలం, యాసంగి రెండు పంటలు సాగు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు పక్షపాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నదని తెలిపారు. తమకు భారీ మెజార్టీ అందించిన తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాము నిరంతరం సమన్వయంతో పని చేస్తామన్నారు. అంతకు ముందు సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీలా, స్థానిక ఎంపీటీసీ జోగు సైదమ్మ, నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈ సత్యనారాయణ, నూక కిరణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్, ఇంతియాజ్, శంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జనార్దన్, ధనుంజయ, రమేశ్, శంకరయ్య పాల్గొన్నారు.

నల్లగొండ కలెక్టర్‌గా నారాయణరెడ్డి బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, జూన్ 16 : నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా చింతకుంట నారాయణరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ప్రస్తుత కలెక్టర్ దాసరి హరిచందన బదిలీ కావడంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న నారాయణరెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా కేంద్రానికి చేరుకున్న నారాయణరెడ్డికి ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ రవి, స్థానిక తాసీల్దార్ శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ భూమయ్య, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ సీసీలు ప్రసాద్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.